క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ప్రత్యేకాధికారి రాజారత్నం, నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారత్నం పాల్గొని 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, రమేశ్, అబ్బి సుందరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయ, శ్రీనాథ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ దంపతులు

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

షాద్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే సోమవారం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామంలోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదురగాలులు, వడగళ్ల వర్షానికి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు సంబంధించి సుమారు 20 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

షాద్‌నగర్ ఏడీఏ బదిలీ



రాజారత్నం

షాద్‌నగర్: గత ఏడేళ్లుగా షాద్‌నగర్ వ్యవసాయ డివిజనల్ అధికారిగా(ఏడీఏ) విధులు నిర్వహిస్తున్న రాజారత్నంకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సోమవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణపేట అగ్రికల్చర్ టెక్నాలజీ(ఆత్మ) పీడీగా బదిలీపై వెళ్లారు. షాద్‌నగర్ ఏడీఏగా అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కొత్త ఏడీఏ వచ్చేవరకు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్ ఇన్‌చార్జిగా ఉండనున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషిచేస్తామని బుడ్డిగారి కుమారులు బుడ్డిగారి సత్తయ్య, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, నర్సింహ అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో తమ తల్లిదండ్రులు జంగయ్య, బుచ్చమ్మల జ్ఞాపకార్థం గత 15 రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వారు సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి షాద్‌నగర్ జట్టుకు రూ.30వేల నగదు, రెండో బహుమతిగా హైతాబాద్ జట్టుకు రూ.20వేల నగదు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో యువకులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

- ఆర్డీఓ చంద్రకళ
- రైతు సమస్యను పరిష్కరించి ఆర్డర్ కాపీ అందజేత

చేవెళ్ల: భూభారతితో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు ఇక తీరినట్లేనని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం భూభారతి ద్వారా ఓ రైతు ఏళ్లనాటి కోర్టు సమస్యకు పరిష్కారం చూపించి పట్టా పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసిన కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూభారతి రైతుల పాలిట వరంలాంటిన్నారు. ఇకపై భూ సమస్యలు ఉండవన్నారు. కేతిరెడ్డిపల్లి రైతు మోహన్‌రెడ్డి కోర్టులో ఉన్న భూ సమస్య పరిష్కారమవడమే దీనికి నిదర్శనం అన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లికి చెందిన మోహన్‌రెడ్డికి అదే గ్రామంలోని సర్వే నెంబర్ 399, 397లలో ఒక ఎకరం 12 గుంటల భూమి ఉంది. ఈ భూమి మీద తన భార్య కోర్టులో కేసు వేసింది. కోర్టులో మోహన్‌రెడ్డికి తీర్పు అనుకూలంగా వచ్చింది. కాని దీనికి సంబంధించి ఆయనకు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పాస్‌పుస్తకం ఇవ్వలేకపోయారు. దీంతో ఆయన గత ఏడాది కాలంగా సమస్య పరిష్కారం కోసం కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై భూభారతిలో ఆయన సమస్యను పరిష్కరించామన్నారు. సమస్యలను పరిష్కరించటంతో పాటు సోమవారం ఆయనను పిలిచి పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసినట్లుగా ఓ కాపీని అందజేసినట్లు తెలిపారు. రైతులు ఎవరూ భూ సమస్యలు పరిష్కారం కావటం లేదని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా రైతు మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశాడు.



చేవెళ్ల: రైతు మోహన్‌రెడ్డికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

ఆ భూములను పంచాయతీకి ఇవ్వాలని వినతి

కొందుర్గు: మహదేవ్‌పూర్ రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూములను గ్రామపంచాయతీల విభజనలో భాగంగా పులుసుమామిడి గ్రామానికి కేటాయించారని, దీంతో తమ గ్రామానికి రావాల్సిన రెవెన్యూ పులుసుమామిడి గ్రామానికి పోతుందని మహదేవ్‌పూర్ గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో భాగాంగా మహదేవ్‌పూర్ గ్రామానికి వచ్చిన రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 200, 202, 203, 308, 312, 346 భూములను మహదేవ్‌పూర్ గ్రామపంచాయతీకి కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాగళ్ల నర్సింహ, సంజీవ తదితరులు ఉన్నారు.



కొందుర్గు: రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొనాయపల్లి, సంతాపూర్ గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సవరణల ద్వారా రాజ్యాంగం వారికి అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో అడ్డుకుందని, రాజ్యాంగ సవరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించి, వారిని కూడా ఉద్యమంలో భాగస్వాములను చేయాలనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, తైదా పర్వతాలు, భీమయ్య, నర్సింలు, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



కొనాయపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

జీపీ వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య



మండల ప్రత్యేకాధికారికి సమ్మె నోటీస్ అందిస్తున్న రాంచంద్రయ్య, కార్మికులు

కేశంపేట: కార్మికుల చట్టాల రక్షణ కోసం ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జీపీ వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం మండల ప్రత్యేక అధికారి రాజారత్నం, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి సమ్మె నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టాలను విభజిస్తోందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్న జనాభాకు అనుగుణంగా కార్మికులను నియమించాలని కోరారు. కార్మికులు, కర్షకులు దేశవ్యాప్త సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు రవి, పారేష, పద్మ, అంజయ్య, మల్లయ్య, రోశయ్య, యాదమ్మ, లక్ష్మమ్మ, లింగమ్మ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ శాస్త్రవేత్త డా.ప్రగతికుమారి
- పెద్దమంగళారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం
- రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు అందజేసిన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

మొయినాబాద్‌రూరల్: రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించినప్పుడు పండించే పంటల్లో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతికుమారి, డాక్టర్ రవీందర్ అన్నారు. సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం పెద్దమంగళారం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతికుమారి(అగ్రనామిస్ట్), డాక్టర్ రవీందర్(మృధిక శాస్త్రవేత్త), పీహెచ్‌డీ వ్యవసాయ విద్యార్థులు సాయిరాం, నలబోలు వందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతుల సమస్యలు తెలుసుకొని పంట మార్పిడి భూసార పరీక్షలు ఎరువుల వాడకం, నీటి ఆధారం వంటి వాటిపై సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పెద్దమంగళారంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.ప్రగతికుమారి

భూసారాన్ని పెంచుకోవాలి



లక్ష్మారెడ్డిగూడలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.శర్మ

శంకర్‌పల్లి: రైతులు తమ పొలంలో భూసారాన్ని పెంచుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించారు. సోమవారం శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ గ్రామంలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా కలిసి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ.. వానాకాలంలో పంట వేసే ముందు తీసుకోవాల్సి జాగ్రత్తలపై వివరించారు. అదేవిధంగా భూసారం పెంచుకునేందుకు గాను పచ్చిరొట్ట ఎరువులను విరివిగా వాడాలని, కూరగాయాల పంటల్లో వచ్చే తెగుళ్లు, వాటి రక్షణ గురించి తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శర్మ, డా.లక్ష్మి, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, ఇన్‌చార్జి ఏఈఓ మనీష, రైతులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే లాభాలు

కొత్తూరు: దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రసీదులను పంటకాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న రైతువేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించే పంటలను సాగుచేయాలన్నారు. ముఖ్యంగా అవసరం మేరకే రసాయన ఎరువులను వినియోగించాలన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగంతో పంటలు, పొలంతో పాటు రైతులు అనారోగ్యాల బారినపడతారని వివరించారు. పంటల సాగులో డ్రిప్ సిస్టంతో నీటి వృథాను అరికట్టి భూగర్భజలాలను కాపాడుకోవాలని తెలిపారు. తరచూ పంటమార్పిడి చేయడంతో భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. సాధ్యమైనంత వరకు రైతులు పొలాల గట్లు, ఖాళీ ప్రాంతాల్లో చెట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డీవీ రామాంజనేయులు, చైతన్య, ఏడీఏ రాజారత్నం, ఏఓ గోపాల్‌నాయక్, ఏఈఓ దీపిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

మొయినాబాద్: పదిలో ఉత్తమ ఫలితాలతో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు సన్మానించారు. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో కనకమామిడి పాఠశాల విద్యార్థిని గౌతమి 525 మార్కులతో మొదటి స్థానం, పెద్దమంగళారం పాఠశాల విద్యార్థిని పి.మానస 523 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్కెపల్లి పాఠశాల విద్యార్థిని సాదియా అంజుమ్ 522 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ మల్లయ్య, రిటైర్డ్ ఎంఈఓ వెంకటయ్యల చేతులమీదుగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులను సైతం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, అబ్దుల్ అమీద్, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు నివాళి

చేవెళ్ల: కమ్యూనిస్టు మేనిఫెస్టో గ్రంథ రచయిత కార్మిక వర్గానికి దిక్సూచి కారల్ మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. చేవెళ్లలో సోమవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు శివ, మంజుల, మీనాక్షి, కృష్ణాగౌడ్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

శంకర్‌పల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మోకిల పీఏసీఎస్ చైర్మన్ గోపాల్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండలం మోకిలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యంలో గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2300ల మద్దతు ధర ప్రభుత్వం చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా సన్న ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. శంకర్‌పల్లి, చుట్టూ పక్కల మండలాల, గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, ఏఈఓ రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య, గ్రామ రైతులు మోహన్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ గోపాల్

వేసవి శిబిరాలతో విద్యార్థులకు మేలు

మండల విద్యాధికారి చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మండల విద్యాధికారి మఠం చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట, పాపిరెడ్డిగూడ, కేశంపేట గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సంగీతం, చిత్రలేఖనం, చదరంగం, ఇండోర్‌గేమ్స్, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం), వ్యక్తిత్వ వికాసం, కథలను చెప్పడం, కుట్లు, అల్లికలు, యోగ, ధ్యానం, సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణను అందిస్తారని తెలిపారు. మండలంలోని మూడు శిక్షణ కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో వంద మందికి ఈ నెల 19 వరకు శిక్షణ ఇస్తారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూనిఫామ్ నాణ్యంగా కుట్టాలి

ఏపీఎం నర్సింహ




మాట్లాడుతున్న ఏపీఎం నర్సింహ తదితరులు

కొందుర్గు: విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ కుట్టడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఏపీఎం నర్సింహ సూచించారు. సోమవారం ఎదిర క్లస్టర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థుల యూనిఫామ్ కుట్టడాన్ని మహిళలకు అప్పగించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్లస్టర్ పరిధిలోని పది పాఠశాలల్లో చదువుతున్న 464 మంది విద్యార్థుల యూనిఫామ్‌ను నాణ్యతాయుతంగా కుట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ స్వర్ణలత, గ్రామ సంఘం అధ్యక్షురాలు సుమలత, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, గ్రామస్తులు రవి, సురేందర్, వీఓఏ ఉమ పాల్గొన్నారు.

వీధి లైట్ల బహూకరణ

షాద్‌నగర్: మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నేత రవీందర్‌రెడ్డి వీధి లైట్లను బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి గ్రామానికి 20 వీధి లైట్లను కార్యదర్శి విజయలక్ష్మికి అందజేశారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి లైట్లు అందజేసినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంచంద్రారెడ్డి, అమరేందర్‌రెడ్డి, కేశవులు, నరేశ్, బుచ్చిరెడ్డి, సాయిరెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్, బాలయ్య, ఆంజనేయులు, కన్నా, భీమోజీ, యాదయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శికి విద్యుత్ లైట్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డి

కేంద్ర నిధులతోనే రేషన్ బియ్యం

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో రేషన్ దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఉన్న రేషన్ దుకాణాలను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల వద్ద ప్రధాని మోదీ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అంత్యోదయ పథకం కింద రేషన్ దుకాణాల్లో ఒక్కో కుటుంబానికి వచ్చే 35 కిలోల బియ్యం పూర్తి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే కేంద్ర నిధులతో ఇచ్చే రేషన్ బియ్యాన్ని తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందరికీ తెలిసేవిధంగా పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుందని, వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, ప్యాట అశోక్, వంశీకృష్ణ, కుర్మయ్య, రుషికేష్, రాము, అంజి, మహేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

మొయినాబాద్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండలం, మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం నగరంలోని సబితారెడ్డి ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్‌చేసి వేడుకలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్త మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, నాయకులు రవియాదవ్, అంజిరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన చేవెళ్ల నాయకులు

చేవెళ్ల: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి జన్మదినం సందర్భంగా చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో సోమవారం ఆమె జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నాయకులు దేశమోళ్ల అంజనేయులు, మాధవ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశం గుప్తా, భీమయ్య, నాయారణ, వనం మహేందర్, మానిక్యరెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్, జహంగీర్ తదితరులు ఉన్నారు.



మొయినాబాద్: సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల చెన్నారెడ్డి

మొయినాబాద్‌రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వానికి ఎంతో దోహద పడతాయని రైతు సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల చెన్నారెడ్డి అన్నారు. సోమవారం అజీజ్‌నగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ పట్లోళ్ల వెంకట్‌రెడ్డి సోదరుడు మల్లారెడ్డి జ్ఞాపకార్థంగా జిల్లాస్థాయి పీవీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ స్వర్గీయ వెంకట్‌రెడ్డి కుమారుడు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఆయా గ్రామాల నుంచి 15 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. అజీజ్‌నగర్ సమీపంలోని క్రికెట్ గ్రౌండ్‌లో టోర్నమెంట్‌ను పట్లోళ్ల చెన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పట్లోళ్ల బిందురెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.